
క్లుప్తంగా

ప్రసన్న పరామర్శ



ఇందుకూరుపేట : మండలంలోని కొరుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెలుగు తిరుమలరావును మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా తిరుమలరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొరుటూరులోని ఆయన నివాసానికి ప్రసన్న విచ్చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, షబ్బీర్, పామంజి శ్రీనివాసులు, స్వర్ణా శ్రీనివాసులురెడ్డి, తులసీరాం, మోవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయ కర్తలుగా గండ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

యోగా గురువుకు సన్మానం



కొడవలూరు : మండలంలోని గండవరానికి చెందిన యోగా గురువు జ్యోతి రాజేంద్రకుమార్‌ను విజయవాడలో శనివారం ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచడంతో ఆయన్ను సత్కరించారు.

క్రీడా సామగ్రి అందజేత



మనుబోలు: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థులకు క్రీడా సామగ్రిని దాతలు సాని వెంకటరమణయ్య, శివుడు రాజాగౌడ్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని వసతిగృహానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మేట్రిన్ మహేశ్వరి తదితరులను సత్కరించారు. ఎస్సై శివరాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మహా శోభాయాత్ర



పొదలకూరు: భాగవత సప్తాహ ప్రారంభాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహా శోభాయాత్రను శనివారం నిర్వహించారు. త్రిదండి రామానుజ అహోబిల జీయర్‌స్వామి హాజరయ్యారు. రామ్‌నగర్ గేట్ సెంటర్ నుంచి దేవస్థానం వరకు శోభాయాత్ర సాగింది.

బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్రీనివాసులు



అభినందిస్తున్న నేతలు

వెంకటాచలం: బీజేపీ మండలాధ్యక్షుడిగా అసనాపురం శ్రీనివాసులు ఎన్నికయ్యారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో నేతలతో సమావేశాన్ని పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి కాకుటూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాసులుకు నియామక పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అందజేశారు. మాజీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులుయాదవ్, ఆలూరు ప్రసాద్‌నాయుడు తదితరులు సత్కరించారు.

ఎట్టకేలకు..

- నావూరు రోడ్డు పనులు వేగవంతం
- గత ప్రభుత్వ హయాంలోనే 70 శాతం పూర్తి
- ఎనిమిది గ్రామాల ప్రజల కోసం..



నావూరు మార్గంలో వేసిన బీటీ రోడ్డు

పొదలకూరు: ఎన్నో ఏళ్లగా రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న ఏడు గ్రామాల ప్రజల కల నెరవేరనుంది. దెబ్బతిన్న రోడ్డుపై ప్రయాణం చేయలేక ప్రభగిరిపట్నం, అమ్మవారిపాళెం, నేదురుమల్లి, బత్తులపల్లి, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం ప్రజలు అల్లాడేవారు. గత ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబర్‌లో అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రోడ్డు నిర్మాణానికి నిధులను సాధించి పనులను ప్రారంభించారు. అప్పట్లోనే 70 శాతం మేర పూర్తయ్యాయి.

ఎన్నికల కోడ్‌తో ఆగి..

ఎన్నికల కోడ్ తదితర కారణాలతో పనులు నిలిచిపోయాయి. ఈ ఏడాది జనవరి వరకు ఇదే తరహాలో పరిస్థితి నెలకొంది. అయితే పీఎంజీఎస్‌వై కింద మంజూరైన రోడ్డు పనులు కావడం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల భాగస్వామ్యం ఉండటంతో సంబంధిత కాంట్రాక్టర్లకు పనులు చేసినంత వరకు బిల్లులను చెల్లించడంతో మిగిలిన పనులను ప్రారంభించారు. ఈ తరుణంలో బీటీ రోడ్డు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో మార్కెటింగ్, ఆసియన్ బ్యాంక్ నిధులతో 100 గ్రామీణ రోడ్ల పనులను మంజూరు చేశారు. అయితే వీటిలో చాలా మేరకు రద్దు చేశారు.

రూ.10.83 కోట్ల మంజూరు

పొదలకూరు – సంగం మెయిన్ రోడ్డు నుంచి నావూరు రోడ్డు.. చేజర్ల మండలం రెడ్డివారి కండ్రిక వరకు నిర్మాణానికి రూ.10.83 కోట్లు గత ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. మార్గమధ్యలో దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులకు సైతం రూ.3.62 కోట్లను మంజూరు చేశారు. వీటిని చేపట్టేందుకు గానూ అప్పట్లో డైవర్షన్ రోడ్డునూ నిర్మించారు. నావూరుపల్లి నుంచి సంగం – పొదలకూరు మెయిన్ రోడ్డు వరకు బీటీని పూర్తి చేసిన కాంట్రాక్టర్లు మార్గమధ్యలో చెన్నారెడ్డిపల్లి శివాలయం వద్ద సీసీ రోడ్డు, పెద్దవాగు సమీపంలోని చిన్నవాగుపై చప్టా నిర్మాణ పనులను చేపట్టారు. మిగిలిన బీటీ పనులను త్వరలో పూర్తి చేయనున్నామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. ఎగువ నుంచి వస్తున్న నీటి ఉధృతి తగ్గితే పనులను ప్రారంభించనున్నారని తెలిసింది.

సర్వేపల్లిలో 75 రోడ్ల పనులు రద్దు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 25 శాతం పూర్తయిన పనులను కొనసాగిస్తామని, ప్రారంభించకపోతే రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సర్వేపల్లిలో మార్కెటింగ్, ఆసియన్ బ్యాంక్ నిధులతో మంజూరైన 75 రోడ్ల పనులను రద్దు చేశారు. అవసరమైన రహదారులను తిరిగి చేపట్టకుండా రద్దు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన వాటిని పూర్తి చేసి ఉంటే సర్వేపల్లి నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు పూర్తయ్యేవి. మండలంలోని కనుపర్తి బ్రాంచ్ రోడ్డుపై బీటీని వేయాల్సి ఉంది. ఈ రోడ్డు సైతం 70 శాతం పూర్తి కావడంతో రద్దు చేసిన జాబితాలో లేదు. పనులను త్వరలో పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



ఇంకా ప్రారంభం కాని పెద్దవాగు బ్రిడ్జి

నావూరు రోడ్డు త్వరలో పూర్తి

నావూరు రోడ్డు పనులను త్వరలో పూర్తి చేస్తాం. ఇప్పటికే పనులు దాదాపు పూర్తి కావొస్తున్నాయి. మార్గమధ్యలో పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయిస్తాం. పనులు జాప్యం కావడంపై నోటీసులను అందజేశాం.

– సుధాకర్, పీఆర్ ఏఈ, ప్రాజెక్ట్స్, పొదలకూరు

హామీలను అమలు చేయకుండా కాలయాపన



గ్రామస్తులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు బూటకమనే విషయం ప్రజలకు అర్థమైందని, వీటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరుకు శనివారం ఆయన విచ్చేశారు. తనను కలిసిన ప్రజలతో ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పింఛన్లను అన్యాయంగా తొలగిస్తున్నారని ప్రజలు తెలియజేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి పనితీరుపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ఉచిత ఇసుకను 16 టైర్ల లారీలతో అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. సూరాయపాళెం, విరువూరు రహదారి వెంట ఇసుక నిండిపోతోందని దుయ్యబట్టారు. గ్రావెల్‌ను తరలించి లేఅవుట్లకు విక్రయిస్తున్నామని, ట్రాక్టర్ డ్రైవర్ వెల్లడించినా, పచ్చ గ్యాంగ్ మాత్రం రోడ్లకు తోలుతున్నామని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై లెక్కలు తేల్చడం ఖాయమని స్పష్టం చేశారు. తప్పులు చేస్తున్న అధికారులను వదిలే ప్రసక్తే లేదని, వారు సమాధానం చెప్పి తీరాలని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొనే హక్కు చంద్రబాబుకు లేదని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. సర్వేపల్లిలో అభివృద్ధి లేదని, అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. పట్టణంలోని పార్టీ నేత తుమ్మల ప్రసాద్ తల్లి ఆనందమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వూకోటి లక్ష్మీనారాయణ, తుమ్మల శ్రీనివాసులు, రమణయ్య, వెంకటకిశోర్, మందా రామిరెడ్డి, సోమా పెంచలయ్య, ఎంపీటీసీ శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా చైతన్య యాత్ర



ముత్తుకూరు: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాచైతన్య యాత్రను చేపట్టామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య పేర్కొన్నారు. మండలంలోని ఈపూరులో చైతన్య యాత్రను శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగావకాశాలను కల్పించాలని కోరారు. రాధయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జేసీపై ప్రశ్నల వర్షం

బుచ్చిరెడ్డిపాళెం : ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించేందుకు వచ్చిన జేసీ కార్తీక్‌పై రైతులు ప్రశ్నల వర్షం కురిపించారు. నగరంలోని వవ్వేరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు శనివారం జేసీ రాగా రైతులు పలు సమస్యలను ఆయనకు వివరించారు. తేమ శాతం అధికంగా ఉందని ధాన్యం కొనుగోలును నిలిపి వేస్తున్నారని, అదే విధంగా గోనె సంచులు, ట్రాన్స్‌పోర్టు చార్జీల విషయమై సమాచారం ఇవ్వడం లేదని మొర పెట్టుకున్నారు. దీంతో జేసీ తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తారని, గోనె సంచులు, రవాణా, కూలీలతో సహా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీనిచ్చారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి, ఏఓ సురేంద్రరెడ్డి తదితరులు అధికారులు ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

విడవలూరు : మండలంలోని వావిళ్ల జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి, జనసేన మండలాధ్యక్షుడు కమతం శ్రీనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎస్సై పి.నరేష్ చేతుల మీదుగా అందించారు. అనంతరం పాఠశాలలో పనిచేసే ఆయమ్మలకు సత్కరించారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శనివారం తెలిపారు. 2వ యూనిట్లో 565 మెగావాట్లు, 3వ యూనిట్లో 710 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 1వ యూనిట్లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోగా, ఆదివారం నుంచి తిరిగి ఉత్పత్తి జరుగవచ్చని ప్రాజెక్ట్ ఇంజినీర్లు భావిస్తున్నారు.

రిజర్వాయర్ కరకట్ట ఆక్రమణపై ఫిర్యాదు



జేసీకి సమస్యను తెలియజేస్తున్న గ్రామస్తులు

బుచ్చిరెడ్డిపాళెం : కనిగిరి రిజర్వాయర్ కరకట్ట ఆక్రమణపై స్థానికులు వవ్వేరు గ్రామంలో జేసీ కార్తీక్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. వంద మంది అధికార పార్టీ నాయకులు కరకట్టను ధ్వంసం చేస్తున్నారని, తద్వారా ప్రమాదం పొంచి ఉందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా మరో నాయకుడు ప్రార్థనా మందిరం పేరుతో చెరువులోనే భారీ భవనాలు నిర్మిస్తున్నారని, స్థానిక అధికారులకు తెలిసి కూడా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై జేసీ అక్కడే ఉన్న తహసీల్దార్‌ను నిలదీశారు. తాము చెప్పాము సార్.. పనులు ఆపేశారని ఆయన సమాధానం ఇవ్వడంతో ఫిర్యాదుదారులు మాట్లాడుతూ అధికారులు వచ్చివెళ్లిన ఒక్కరోజు మాత్రమే పనులు ఆపుతున్నారని, తరువాత యథావిధిగా సాగుతున్నాయన్నారు. దీంతో జేసీ ఆగ్రహించి పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు.

రెండు రోజుల్లోపు నగదు జమ



ఇందుకూరుపేట : రైతులతో మాట్లాడుతున్న కార్తీక్



కొడవలూరు : వివరాలు ఆరాతీస్తున్న జేసీ

ఇందుకూరుపేట : ధాన్యాన్ని అమ్మిన రెండు రోజుల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని జాయింట్ కలెక్టర్(జేసీ) కార్తీక్ అన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ షెడ్యూలింగ్ ఇచ్చిన రైతులకు గోనే సంచులు, హమాలీ, రవాణా ఖర్చులను ప్రభుత్వమే ఇస్తోందన్నారు. ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నిరకాల సదుపాయలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, మండల ఏఓ రఘునాథ్‌రెడ్డి, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు షెడ్యూలింగ్ చేయించుకోవాలి

➡ **కొడవలూరు :** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునే రైతులు ముందుగా వీఏఏను సంప్రదించి షెడ్యూలింగ్ చేయించుకోవాలని జేసీ కార్తీక్ సూచించారు. మండలంలోని కొడవలూరు, తలమంచి, నార్తురాజుపాళెంలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పుట్టికి రూ.19,720లు ఇస్తున్నట్లు చెప్పారు. రైతులు వరికోతకు ముందుగా సంబంధిత కొనుగోలు కేంద్రంలో సంప్రదిస్తే అవసరమైన ఏర్పాట్లను చేస్తారన్నారు. అనంతరం మాయిశ్చర్ మీటర్‌ల పనితీరు, ధాన్యం తరలించే వాహనాల అందుబాటు, వాటి జియో ట్యాగింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంకట తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి, ఏఓ లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

➡ **విడవలూరు:** స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ కార్తీక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎస్‌ఓ జి.గురప్ప, తహసీల్దార్ కె.చంద్రశేఖర్, మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య, వీఏఏ అరుణ పాల్గొన్నారు.

కొడవలూరు ఉద్యోగినుల సత్తా



ఏడు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్న లైబ్రేరియన్ రాజేశ్వరి



మొదటి బహుమతి అందుకుంటున్న నాగభూషణమ్మ

కొడవలూరు : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులో ఏపీ ఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కొడవలూరు మండల ఉద్యోగినులు సత్తా చాటారు. కొడవలూరు గ్రంథాలయాధికారిని కందుకూరు రాజేశ్వరి లాంగ్ జంప్, డిస్కత్రో, జావెలెన్ త్రో, షాట్ ఫుట్, త్రోబాల్, టగాఫ్ వార్, స్కిప్పింగ్‌లలో బహుమతులు గెలుపొందారు. ఐసీడీఎస్ నార్తురాజుపాళెం సెక్టార్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఫ్యాన్సీ డ్రెస్ షోలో మొదటి బహుమతి గెలుచుకోగా, కొడవలూరు సూపర్‌వైజర్ ఎస్.నిర్మల జావెలెన్ త్రోలో రెండో బహుమతి, కేరమ్స్‌లో రన్నర్‌గా నిలిచారు. ఈ మేరకు నెల్లూరులోని ఎన్జీఓ హోమ్‌లో శనివారం వీరికి బహుమతులు అందజేశారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కోవూరు : మహిళల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని లేగుంటపాడు గ్రామంలో జరిగిన ఉచిత టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవితో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



టైలరింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

శ్మశాన స్థలం కేటాయించాలి

కోవూరు : మండల పరిధిలోని గంగవరం పంచాయతీ రామచంద్రాపురం గిరిజన కాలనీకి శ్మశానం స్థలం కేటాయించాలని స్థానికులు శనివారం కోరారు. ఈ మేరకు సీపీఎం ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా కమిటీ నాయకుడు గండవరపు బుజ్జియ్యకు సమస్యను వివరించారు. ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం ఉండడం లేదన్నారు. సీపీఎం నాయకులు స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీపీఎం నేతలు గండవరపు శేషయ్య, సురేష్, మోహన్‌హరి, రమణయ్య, గ్రామస్తులు సంజీవయ్య, సునీల్, లక్ష్మయ్య, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

కోవూరు : లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులకు సత్వర న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి చైతన్య అన్నారు. కోవూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు లోక్ అదాలత్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శివ నమ్రత, లోక్ అదాలత్ సభ్యులు వి.రాంబాబు, వంశీప్రియ, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

- ఘనంగా మహిళా దినోత్సవం

మనుబోలు: మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ పేర్కొన్నారు. మనుబోలు సచివాలయం – 1లో మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఉమెన్ ఫ్రెండ్లీ మోడల్ పంచాయతీగా మనుబోలు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. ఎంపీడీఓ జలజాక్షి, ఎస్సై శివరాకేష్, స్టేట్ అబ్జర్వర్ వెంకటేశ్వర్లు, డీటీఎం రవికుమార్, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** పట్టణంలోని పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పెన్షనర్లు ఝాన్సీలక్ష్మీబాయ్, మంగమ్మ, నజీర్‌బీ, వేమమ్మ, రమణమ్మను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, బాధ్యులు మస్తాన్‌సాహెబ్, లక్ష్మీనారాయణ, మస్తానయ్య, నారాయణరెడ్డి, పెంచలనర్సయ్య, కృష్ణయ్య, మస్తాన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జొన్నవాడలో...

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకటగిరికి చెందిన ఉదయ్‌కుమార్, దేవి దంపతులు దేవస్థాన మహిళా ఉద్యోగులను సన్మానించారు. స్వీట్లు, చీరలు అందజేశారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం :** స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ కోవూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రవల్లిక పాల్గొని, మాట్లాడారు. మహిళల సమాన హక్కుల సాధనకు అంబేడ్కర్ బాటలు వేస్తే వాటిని అమలు చేసిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే చెందిందన్నారు. కౌన్సిలర్లు బిత్రగుంట ప్రమీల, కంటా అనంతమ్మ, షేక్.షకీలా ఇంకా పలువురు మహిళా నాయకులు మాట్లాడారు. అనంతరం కేక్‌కట్ చేసి మహిళలకు పంచి పెట్టారు.

➡ **కోవూరు :** స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించినట్లు గుర్తుచేశారు.



మనుబోలు: సత్కారం అందుకున్న మహిళలు



పొదలకూరులో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో..



బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..



కోవూరులో..